క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మీఎం పాలెం: స్థానిక 33/కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రెవెన్యూ లే అవుట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పైన పేర్కొన్న సమయంలో రామరాజు లే అవుట్, శివాలయం తదితర ఏరియాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

మండల పరిషత్ సమావేశం నేడు

తగరపువలస: భీమిలి మండల పరిషత్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు. మండల పరిషత్ సాధారణ సమావేశ మందిరంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా నల్ల మారమ్మ ఉత్సవం



పాత కురపల్లిలోని నల్ల మారమ్మ ఆలయం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపలిలో నల్ల మారమ్మ ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కొత్త కురపల్లి, పాత కురపల్లి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పాత కురపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిపై కేసు

ఎంవీపీ కాలనీ: విద్యుదాఘాతానికి గురై మారికవలసకు చెందిన ఉప్పల సత్యజగన్నాథరావు(40) మృతి చెందిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సత్యజగన్నాథరావు ఎంవీపీ కాలనీలోని సీఎంఆర్ కార్లాన్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 9న యథావిధిగా ఆయన విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సత్యజగన్నాథరావు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఆయన్ను కేజీహెచ్‌కు తరలించి, విషయాన్ని ఆయన భార్య సునీతకు గ్రెయిన్డర్ కాంట్రాక్టర్ వెంకట్ అప్పారావు ఫోన్ చేసి చెప్పారు. ఆమె కేజీహెచ్‌కు వెళ్లి చూడగా అప్పటికే జగన్నాథరావు మరణించి ఉన్నాడు. ఈ నేపథ్యంలో తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ ఆమె ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్డు అధ్వానం



రేవళ్లపాలెం వద్ద మాస్టర్‌ప్లాన్ రోడ్డు దుస్థితి

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డు దారుణంగా ఉంది. రోడ్డు అభివృద్ధి చేయాలంటే, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం ఇచ్చి, రోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ, ఎమ్మెల్యే గంటా, అధికారులు వచ్చి చూసి వెళ్లడమే తప్ప ఫలితం ఉండటం లేదు. మరోవైపు రోడ్డుకు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ అవస్థలు తీరేదెప్పుడా అని నిరీక్షిస్తున్నారు.

ఘనంగా శివానందమూర్తి వర్ధంతి



అలంకరణలో శివానందమూర్తి విగ్రహం

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని ఆనందవనంలో సద్గురు శివానందమూర్తి ఆశ్రమం వద్ద ఆయన 11వ వర్ధంతిని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు రాఘవేంద్రరావు, రాధాకుమారి, సాయినాథ్, ఇతర సభ్యులు ఆయన విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, అంజలి ఘటించారు. ప్రత్యేక ఆహ్వానితులు మాట్లాడుతూ శివానందమూర్తి విశిష్టత గురించి వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డును తవ్వేశారు

8వ వార్డులో ఇష్టానుసారం తవ్వకాలు • ధ్వంసమవుతున్న ప్రభుత్వ ఆస్తులు • కొరవడిన అధికారుల పర్యవేక్షణ



రోడ్డును తవ్వేసిన దృశ్యం



ముబారక్ కాలనీలో తవ్విన రోడ్డు

మొన్న ముసలయ్యపాలెంలో జీవీఎంసీ నిర్మించిన మెట్ల మార్గాన్ని తవ్వేశారు. నిన్న దానికి కాస్త దూరంలో మరో మెట్ల మార్గం తవ్వేశారు. నేడు ఏకంగా రోడ్డునే తవ్వేశారు. ఇదంతా ఎక్కడో దూరంగా కాదు. సచివాలయానికి కాస్త దూరంలోనే జరుగుతున్నా, ఏ ఒక్క అధికారీ చర్యలు తీసుకోకపోవడం స్థానికులను విస్తుపోయేలా చేస్తోంది.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఎండాడ దరి ముబారక్ కాలనీలో మంగళవారం ఇక్కడ మసీదు నుంచి వ్యర్థపు నీరు బయటకు పోయేందుకు పైపు లైన్లు ఏర్పాటు చేసేందుకు ఎటువంటి అనుమతులు లేకుండా ఏకంగా బీటీ రోడ్డునే తవ్వేశారు. అయితే ఈ తవ్వుతున్న మార్గంలో జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్ ధ్వంసమైపోయింది. అండర్ గ్రౌండ్ విద్యుత్ వైర్లు బయటకు వచ్చేశాయి. కాస్త నిర్లక్ష్యం వహిస్తే విద్యుత్ షాకుతో పెనుప్రమాదం సంభవించి ఉండేది. ఈ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి లక్షల్లో ఆస్తినష్టం జరిగింది.

నీటి సరఫరాకు అంతరాయం

పైపులైను పగిలిపోవడంతో గొల్లల ఎండాడ, రాజీవ్‌నగర్, సుభాష్‌నగర్, బీచ్‌రోడ్డు ప్రాంతాలకు మంచి నీటి సరఫరా మంగళవారం నిలిచిపోయింది. మరమ్మతులు పూర్తయి, ఎప్పటికి నీటి సరఫరా జరుగుతుందో తెలియని పరిస్థితి.




ధ్వంసమైన జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్

నిలిచిన రాకపోకలు

రోడ్డును తవ్వేయడంతో గొల్లల ఎండాడ, రాజీవ్‌నగర్, సుభాష్‌నగర్, బీచ్‌రోడ్డుకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

అధికారుల మౌనం

జీవీఎంసీ 8వ వార్డులో కొండ ప్రాంతాలు తవ్వినా, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసినా, గెడ్డలు కప్పివేసినా, ప్రభుత్వ భూములను ఆక్రమించినా, అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మించినా ఏ ఒక్క అధికారి కూడా స్పందించడం లేదు. ఒకవేళ ఎవరైనా పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారాన్ని చూపించలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆక్రమించే వారు, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసేవారు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రభుత్వ ఆస్తుల జోలికి వచ్చేవారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఇలాంటి సంఘటనలు అదుపు చేయలేమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డును తవ్వేయడంతో బయటకు వచ్చిన అండర్‌గ్రౌండ్ విద్యుత్ వైర్లు

నిలిచిన విద్యుత్ సరఫరా

విద్యుత్ వైర్లు పాడవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే సాయంత్రం వరకు వర్షం పడుతుండడంతో మరమ్మతులు చేపట్టడం సాధ్యం కాలేదు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. అయితే, ఇంత జరుగుతున్నా ఏ శాఖకు సంబంధించిన అధికారులు రాకపోవడం, చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిని తవ్వినా సంబంధిత అధికారులు స్పందించకపోవడానికి కారణం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటిస్తాం

జీవీఎంసీ 8వ వార్డులో ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంపై తరచూ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు వస్తున్నాయి. సంబంధిత అధికారులకు ఈ ఫిర్యాదులను బదిలీ చేసినా నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇక నుంచి నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి, కఠినమైన చర్యలు తీసుకునే విధంగా ప్రణాళికలు రూపొందిస్తాం. ముసలయ్యపాలెంలో పలు చోట్ల జీవీఎంసీ ఏర్పాటు చేసిన మెట్ల మార్గాన్ని అనుకుని తవ్వకాలు జరుగుతున్న విషయం వాస్తవమే. వాటి పనులు తక్షణమే నిలిపివేయిస్తాం.

– కనకమహాలక్ష్మి, జోనల్ కమిషనర్, జోన్-2

ముగిసిన వేణుగోపాలుని కల్యాణోత్సవాలు



దేవేరులతో పాటు స్వామి వారిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో ఈ నెల ఆరో తేదీ నుంచి జరుగుతున్న వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం వేణుగోపాల స్వామి ఆలయంలో కొలువై ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని పల్లకీలో గ్రామంలో ఊరేగించారు. రాత్రి ఉభయ దేవేరులతో వేణుగోపాల స్వామికి ఉయ్యాల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరామాచారి సహకారంతో అర్చక స్వాములు శ్రీ పుష్ప యాగం నిర్వహించారు. పండ్లు, పుష్పాలు స్వామికి సమర్పించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు పుష్పయాగాన్ని తిలకించారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు



మద్యం సీసాలతో బెల్టు షాపు నిర్వాహకుడు

పద్మనాభం: మండలంలోని ఐనాడలో బెల్టు షాపుపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ జె.సురేష్ సిబ్బందితో ఆ షాపుపై దాడి చేశారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న కోరాడ రాజన్నపై కేసు నమోదు చేసి, అతని నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

చినుకు పడితే అడుగు వేయలేం..



పీఎం పాలెం హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డు ఇలా..

పీఎం పాలెం: చినుకు పడితే అడుగు వేయలేం అన్నట్లుగా ఉన్నాయి రహదారులు. మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి హౌసింగ్ బోర్డు కాలనీలోని అంతర రహదారుల్లో పలు చోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ కారణంగా ఆ మార్గంలో ప్రయాణించే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. ఆర్‌హెచ్ కాలనీ, గాయత్రీనగర్, ముస్లిం కాలనీ, లక్ష్మీవానిపాలెం అశోక్ నగర్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

వర్షంతో అవస్థలు

పద్మనాభం: మండలంలోని పద్మనాభం, కృష్ణాపురం, పాండ్రంగి, మద్ది, రెడ్డిపల్లి, తునివలస, విజయానందపురం, రేవిడి గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై నీరు ప్రవహించడంతో విజయనగరం-శొంఠ్యాం ఆర్‌అండ్‌బీ రోడ్డు, పద్మనాభం-మహారాజుపేట రోడ్డుపై పయనించడానికి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

జిలేబీల అలంకరణలో రాస పోలమాంబ







జిలేబీలతో అలంకరించిన రాస పోలమాంబ, విశేష పుష్పాలంకరణలో గుడివాడ తోగాలమ్మ, ముత్యాలమ్మ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం 109వ అలంకరణలో భాగంగా వినూత్నంగా అలంకరించారు. ఎరుపు, తెలుపు, నీలం, ఆకుపచ్చ జిలేబీలతో పాటు జర్బరా పువ్వులతో అలంకరణ చేశారు. ఈ అలంకరణకు గాను బోనిల రాంబాయి, శారదా కుమారి, శంకరరావు, పద్మ, సురేష్, సిరి సహాయ సహకారాలు అందించారు.

• దివీస్ రోడ్డులోని మజ్జిపేట వద్ద గుడివాడ గ్రామ దేవతలు తోగాలమ్మ, ముత్యాలమ్మలను బంతి, గులాబి, తులసిమాలలు, గడ్డి గులాబి, జాజులు, జర్బరా పువ్వులతో అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాలమ్మ వారాల పండగ



విశేష అలంకరణలో దుర్గాలమ్మ



అమ్మవారి జంగిడితో ఆలయానికి పయనమైన పూజారి, గ్రామ పెద్దలు



అమ్మవారి ఊరేగింపులో బల్ల వేషాలు

మధురవాడ: చంద్రంపాలెం గ్రామ దేవతలు బంగారమ్మ, దుర్గాలమ్మ వారి వారాల పండగను మంగళవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జాతర గట్టుపై వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ, శ్రీ షిర్డీ సాయినాథ సహిత శ్రీ దుర్గాలమ్మ వారి ఆలయం, హైవేని ఆనుకుని ఉన్న బంగారమ్మ వార్ల పండగను రెండేళ్ల పండగకు ఒకసారి, మధ్యలో వారాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి నిత్య పూజలతో పాటు పంచామృత, సుగంధ జలాభిషేకాలు, విశేష అలంకరణ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమలను పూజారి జంగిడిలో పెట్టి తలపై మోసుకుని వచ్చి.. మేళతాళాలు, సాము గరిడీలు, కోలాటం, తీన్ మార్, కర్ర సాము, బల్ల వేషాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం బంగారమ్మ వారికి, తర్వాత దుర్గాలమ్మ వారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించారు.చంద్రంపాలెం, పరిసర ప్రాంతాల భక్తులు హాజరై, మొక్కులు చెల్లించారు.

ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే..



బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: కూటమి ప్రభుత్వం పాలనా పరంగా వరుసగా ఎదురవుతున్న వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ప్రముఖ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ డైవర్షన్ రాజకీయాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రాష్ట్రంలో ఏ మూల చూసినా ఆడబిడ్డలపై వరుస అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అనంతపురంలో ఇంటర్మీడియట్ విద్యార్థినిపై టీడీపీ గూండాలు లైంగికదాడికి పాల్పడితే కొమ్మినేని అరెస్ట్‌తో ప్రజల దృష్టికి రాకుండా చేశారన్నారు. డిబేట్‌లో పొరపాటుగా దొర్లిన పదానికి అప్పుడే కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుతో పాటు సాక్షి యాజమాన్యం క్షమాపణలు చెప్పిందన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెచ్చగొట్టే ధోరణుల ద్వారా ప్రజలను, మీడియాను ఆందోళనకు గురి చేస్తోందన్నారు.

పర్యావరణానికి 'పొగ'



నగరంలోకి వెళ్తున్న ఓ కంటైనర్ నుంచి వెలువడుతున్న పొగ



కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ నుంచి చెత్త తీసుకు వస్తున్న వాహనం నుంచి వస్తున్న పొగ

మధురవాడ: పర్యావరణ పరిరక్షణ.. స్వచ్ఛ సర్వేక్షణ్ అంటూ మాటలతో ఊదరగొడుతున్న అధికారులు, సిబ్బంది ఆచరణలో మాత్రం వాటిని అమలు పరచడం లేదు. కాలం చెల్లిన, కాలుష్య ప్రమాణాలు పాటించని వాహనాల నుంచి పరిమితికి మించి వెలువడుతున్న పొగే ఇందుకు నిదర్శనం. ఇలాంటి వాహనాల్లో జీవీఎంసీ చెత్త తరలించే వాహనాలు ఎక్కువ ఇలాంటివి కనిపిస్తున్నాయి. అందులోనూ కాపులుప్పాడ జీవీఎంసీ డంపింగ్ యార్డుకు తగరపువలస వైపు నుంచి వస్తున్న వాహనాలు ఉన్నాయి. ఇక ఆర్టీసీ కూడా మినహాయింపు లేదు. ఆర్‌టీఏ అధికారులైనా స్పందించి చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



వెంకటసాయి



లహరి



దుర్గాప్రసాద్

తగరపువలస: ఇటీవల ప్రకటించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఆనందపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు వెంకటసాయి, లహరి, దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. ఈ ముగ్గురికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ సెకండియర్ వరకు నాలుగు సంవత్సరాల పాటు ఏడాదికి 12వేల వంతున స్కాలర్‌షిప్ అందనుంది. వీరిని ప్రధానోపాధ్యాయుడు కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏయూ మోడల్ కెరీర్ సెంటర్‌లో నేడు ఇంటర్వ్యూలు

మద్దిలపాలెం: ఏయూలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి పలు సంస్థల్లోని ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మోడల్ కెరీర్ సెంటర్ డిప్యూటీ చీఫ్ కె. దొరబాబు తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ఇన్‌స్టలేషన్ రంగంలో 80 ఖాళీలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఐటీఐ లేదా గ్రాడ్యుయేషన్ తోపాటు 2 ఏళ్ల అనుభవం ఉన్నవారు, 32 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.20,000 వేతనం లభిస్తుంది. ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో 60 ఖాళీలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 26 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ.18,700 వేతనం అందిస్తారు. డి.మార్ట్‌లో 30 ఖాళీలకు ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 25 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ.11,500 వేతనం ఉంటుంది.ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో 50 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. 10వ తరగతి అర్హతతోపాటు 50 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ. 16,000 వేతనం ఇవ్వనున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

పట్టుమని పదిమంది కూడా హాజరు కాని ప్రజాప్రతినిధులు



ఆనందపురం మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక

తగరపువలస: మంగళవారం జరిగిన ఆనందపురం మండల పరిషత్ సాధారణ సమావేశానికి చాలామంది ప్రజాప్రతినిధులు ఆసక్తి కనపరచలేదు. 26 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కలిపి పదిమందికి కూడా మించకపోవడంతో సమావేశం చప్పగా సాగింది. ప్రజాప్రతినిధుల కంటే అధికారులే ఎక్కువ మంది ఉండటం గమనార్హం.

సమావేశంలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సకాలంలో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ రీ సర్వేలో రైతుల పేర్లకు బదులుగా ఇతరుల పేర్లు నమోదు కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పాత భూములకు పట్టాలు పెండింగ్‌లో ఉంచడం అన్యాయమన్నారు. దీనిపై డిప్యూటీ సర్వే అధికారి గోవిందరావు మాట్లాడుతూ మండలంలోని 33 రెవెన్యూ గ్రామాలకు గాను 26 గ్రామాలలో సర్వే పూర్తయిందన్నారు. వైస్ ఎంపీపీ బొట్ట ధనలక్ష్మి తరపున రామకృష్ణ మాట్లాడుతూ గంభీరం బీసీ కాలనీలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభానికి నోచుకోకపోవడంతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జల్‌జీవన్ పనులు పూర్తి కాక పంచాయతీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు.

ముకుందపురం సర్పంచ్ కలిమి గంగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల కింద కేవలం చెరువు పనులు మాత్రమే చేస్తున్నారన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సాగునీటి కాలువలు ఆధునీకరించాలన్నారు. ముందస్తు సమాచారం లేకుండా పంచాయతీలో ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు జరుగుతున్నాయన్నారు. ముచ్చర్ల సర్పంచ్ షిణగం ఎర్రయ్య కూడా విద్యుత్ సమస్యలు ప్రస్తావించారు. ఏవో చావా సంధ్యా రత్నప్రభ మాట్లాడుతూ సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.జానకి, పంచాయతీ విస్తరణ అధికారి సత్యనారాయణ, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పల్ల దుర్గ, షిణగం అప్పలరాజు, తొమురోజు రాము, గుసిడి ముత్యాలు, బంక శ్రీను, బీఆర్‌బీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొంత పార్టీ నాయకులపైనే సెటైర్లు..

సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న టీడీపీ నేత వ్యాఖ్యలు

తగరపువలస: అధికార పార్టీలో ఉన్న నాయకులు, వారిపై ప్రభుత్వ అధికారుల స్పందన చాలా విచిత్రంగా ఉందని టీడీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ బడిగంట నీలకంఠం చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. చిట్టివలస సర్వే నంబర్ 38/1లో 0.15 సెంట్లు ప్రభుత్వ భూమిని సొంత పార్టీ నాయకులు కొప్పల రమేష్, కృష్ణారావు దురాక్రమణ చేశారని ఆరోపిస్తూ గత ఏప్రిల్‌లో సమాచార హక్కు చట్టం ప్రకారం భీమిలి జెడ్సీకి నీలకంఠం దరఖాస్తు చేశారు. ఆ స్థలానికి చెందిన రెవెన్యూ రికార్డులు, పట్టా, టైటిల్ డీడ్‌లను ఆధారంగా చేసుకుని భీమిలి మున్సిపాల్టీ జీవీఎంసీలో చేరక ముందు లేదా చేరిన తరువాత నిబంధనల ప్రకారం సమర్పించిన దస్తావేజులు తనకు ఇవ్వాలని కోరారు. దీనిపై మరోసారి ఈ నెల 2న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ జెడ్సీ కార్యాలయంలో ఎవరూ స్పందించకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.